క్లుప్తంగా

బిల్లు లేకుండా విత్తనాలు కొనొద్దు

సంతమాగులూరు (అద్దంకి): రైతులు గుర్తింపు పొందిన డీలర్ వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలని మండల ఏవో లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లు లేకుండా ఎవరూ విత్తనాలు కొనుగోలు చేయవద్దని, మండల పరిధిలోని పొలాల్లో సాగు చేసిన ఖరీఫ్ సీజన్‌కు ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

మహిళల ఆర్థికాభ్యుద్ధే లక్ష్యం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెల 10 తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బల్లికురవ: ప్రతి విద్యార్థి హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ. శివ లింగారావు కోరారు. జిల్లా స్థాయిలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై జరిగిన క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి విష్ణు విజేతగా నిలిచారు. పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గంగమ్మతల్లికి ఆడపడుచుల సారె



గంగమ్మతల్లికి సారె సమర్పిస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు సారె, పసుపు, కుంకుమలు సమర్పించారు. మంగళవారం ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన అమ్మవారి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో వాకావారి ఇంటి పేరుతో ఉన్న ఆడపడుచులు పెద్ద ఎత్తున సారెను సమర్పించారు. పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బాలికలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి



కేజీబీవీలో విశ్రాంతి గదులను పరిశీలిస్తున్న జడ్జి

బల్లికురవ: విద్యాలయాల్లో చదువుతున్న బాలికలను నిత్యం పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎం, ఉపాధ్యాయినిలపై ఉందని అద్దంకి కోర్టు జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ డీ. నాగ వెంకటలక్ష్మీ అన్నారు. మంగళవారం రాత్రి బల్లికురవలోని కేజీబీవీ, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు కేజీబీవీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, బాలికల విశ్రాంతి గదులు, టాయిలెట్స్, డైనింగ్ హాలు, స్టాక్ రూమ్, భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యాలయంలో చదువున్న బాలికల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, అనారోగ్యంగా ఉంటే వెంటనే సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాలన్నారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ఏ అంశాల్లో వెనుకబడ్డారో గ్రహించి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకోవాలని ఆమె సూచించారు. విద్యాలయాల్లో విద్యుత్ సరఫరా అంతరాయంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి చెక్‌పెట్టేందుకు జనరేటర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తానని జడ్జి తెలిపారు. టాయిలెట్స్, బాలికల విశ్రాంతి గదులు, అపరిశుభ్రంగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో బల్లికురవ, ఏల్చూరు ప్రిన్సిపాల్ కోనా సరళకుమారి, కె శ్రీలక్ష్మీ న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ పి, మార్తా శ్రీను, పాల్గొన్నారు.



రావూరిపేటలో ప్రధాన రోడ్డులో నిలిచిన మురుగు నీరు



పేరుకు పోయిన చెత్త దిబ్బ

ఇదిగో దోమలు.. ఎక్కడ డ్రోన్‌లు !

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమలు
- రోడ్ల మీద మురుగు నీరు, పడకేసిన పారిశుద్ధ్యం
- విజృంభిస్తున్న మలేరియా, డెంగీ కేసులు
- కనపడని డ్రోన్ టెక్నాలజీ

వేటపాలెం: 'దోమల మీద దండయాత్ర.. ఎక్కడైనా సరే దోమలు ఉన్నాయంటే చాలు డ్రోన్‌ల ద్వారా కెమికల్‌ను పిచికారీ చేసే టెక్నాలజీని తెచ్చాం. ఇప్పుడు ఎక్కడా దోమలు లేకుండా చేశాం' అని కూటమి సీఎం చంద్రబాబు అధికారుల మీటింగుల్లో చెప్తుంటాడు. డ్రోన్ సంగతి దేవుడికెరుగగాని కనీసం బ్లీచింగ్, సున్నానికి దిక్కులేదు ఇక్కడా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ వ్యాధులు ఒక వైపు ప్రజలను వేధిస్తున్నాయి. ఈగలు, దోమలు స్వైర విహారంతో ప్రజలకు కంటిమీద కునుక లేకుండాపోతోంది. దోమకాటు కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. రామన్నపేట పంచాయతీ పరిధిలో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. రోడ్లపైనా మురుగు నీరు నిల్వ ఉండటం, రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో అందులో దోమలు ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. దీనికి తోడు పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. వార్డులో పారిశుద్ధ్య పనులతో పాటు రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దుల సమస్యతో ప్రజల అవస్థలు..

వేటపాలెం-రామన్నపేట పంచాయతీ గ్రామాలు రెండు కలసి ఉంటాయి. అయితే రెండు గ్రామాలు సరిహద్దు రోడ్డులో వర్షం నీరు, చెత్త దిబ్బలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు మీద నిలిచిన మురుగు నీరు నెలల తరబడి రోడ్డు మీదనే ఉండిపోతుంది. నిల్వ ఉంచిన చెత్త దిబ్బలు, రోడ్డుపై నిలిచిన వర్షం నీటిలో దోమలు పెరిగిపోయి రోడ్డుకి ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. రామన్నపేట పంచాయతీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లగా ఆ రోడ్డు తమ పరిధిలోది కాదని చెప్పారు. వేటపాలెం పంచాయతీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లగా ఆ రోడ్డు మా పరిధిలోకి రాదని ఇరు పంచాయతీ అధికారిలు రెండు గ్రామాల సరిహద్దు రోడ్డును గాలికి వదిలేశారు. దీనితో చెత్తపేరుకు పోయి, రోడ్డుపై వర్షనీరు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. నెల క్రితం దేశాయిపేటలో ఒక డెంగీ కేసు నమోదవగా లెక్కలేనన్ని మలేరియా కేసులు నమోదయ్యాయని స్థానికులు చెప్తున్నారు. చాలా మంది ప్రభుత్వాసుపత్రికి వెళ్లకుండా ప్రైవేటుకు పరుగులు పెట్టి చికిత్స పొందుతున్నారని సమాచారం. ఇప్పటికైనా ఉన్నత అధికారులు కల్పించుకొని చర్యలు చేపట్టకపోతే రోగాలు మరింత విజృంభించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దోమల బెడద ఎక్కువైంది..



వర్షాకాలంలో ఈగలు, దోమలు బెడద ఎక్కువైంది. రోడ్డుపై మురుగు నీరు మోకాలి లోతున నిలిచిపోవడంతో అందులో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మురుగు నీటి నుంచి వచ్చే దోమలతో రాత్రి, పగలు నిద్రలేకుండా పోతుంది. అధికారులకు దృష్టికి పదుల సార్లు సమస్య తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు.

– మోగిలి రామారావు, రావూరిపేట

ఆ రోడ్డు మా పంచాయతీ పరిధిలోది కాదు..

రామన్నపేట పంచాయతీ రావూరిపేట సరిహద్దులో ఉన్న రోడ్డు మా పంచాయతీ పరిధిలోనిది కాదు. అందువల్ల ఆ రోడ్డులో పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. రోడ్డుపై నిలిచిన నీరు విషయం మా పరిధిలోకి రాదు.

– సురేంద్ర, కార్యదర్శి, రామన్నపేట

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

చినగంజాం: రొయ్యల చెరువుల వద్ద సామాను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ రమేష్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని రాజుబంగారు పాలెం పరిధిలోని 216 జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్ సూర్యనారాయణ రెడ్డి రొయ్యల చెరువుల వద్ద ఒంగోలుకు చెందిన కందిపాటి వెంకటేష్ అనే వ్యక్తి సోమవారం చెరువుకు సంబంధించిన సామగ్రి దొంగలించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సూర్యనారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మంగళవారం ఉదయం వెంకటేష్‌ను అరెస్టు చేశారు. అనంతరం అతన్ని చీరాల కోర్టుకు హాజరు పరచగా కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

16 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

కారంచేడు: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా ప్రణాళికను ఏర్పాటు చేసిందని తహసీల్దారు కే నరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 16వ తేదీన కేశవరప్పాడు, 20న ఆదిపూడి, 22న యర్రంవారిపాలెం, 24న తిమిడెదపాడు, 27న కుంకలమర్రు, 30న స్వర్ణ, సెప్టెంబర్ 3వ తేదీన కారంచేడు, సెప్టెంబర్ 6న నాయుడువారిపాలెం, సెప్టెంబర్ 10న దగ్గుబాడు, సెప్టెంబర్ 13న పోతినవారిపాలెం, సెప్టెంబర్ 17న జరుబులవారిపాలెం, సెప్టెంబర్ 20న కొడవలివారిపాలెం, సెప్టెంబర్ 24న స్వర్ణపాలెం, సెప్టెంబర్ 27న రంగప్పనాయుడువారిపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు జరగుతాయన్నారు. ఈ సదస్సుల్లో తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్ఓ, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్, దేవదాయశాక ప్రతినిధులు, వక్ఫ్‌బోర్డు ప్రతినిధి, రిజిస్ట్రేషన్ ప్రతినిధి, వ్యవసాయాధికారి, హార్టికల్చర్ ఆఫీసర్‌లు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- వేడుకగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ
- ర్యాలీలో విద్యార్థుల సందడి



చినగంజాంలో ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

చీరాల అర్బన్: భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య, దేశనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ తరుపున సరఫరా చేసి మూడు నుంచి పదోతరగతి వరకు పాఠ్యపుస్తకాలను బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తిలకించారు. అనంతరం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.అమృతవాణి, ఎం.జ్యోతి, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

చినగంజాం: స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి రత్నకుమారి సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సుబ్బారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: ఆగస్టు 15 వేడుకలను గ్రామస్థాయి నుంచే ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ కోరారు. అనంతరం జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంఈవో,1,2 వస్తం నాయక్ డీ. రమేష్‌బాబు, రీ సర్వే డీటి ప్రహర్ష, ఏఎస్‌వో అమర్‌నాథ్ వీఆర్‌వో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో గ్రామంలోని వీధుల వెంట ప్రదర్శన నిర్వహించారు.



చీరాలలో దేశ నాయకులకు నివాళులర్పిస్తున్న విద్యార్థినులు



బల్లికురవలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



వలపర్లలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఏ సంధ్యారాణి



పీ గోపికృష్ణ



పీ.హితేంద్ర

జే.పంగులూరు: జిల్లాస్థాయిలో విద్యాశాఖ నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలోని కొండమంజులూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ జీవన వైవిధ్య మండలి ఆధ్వర్యంలో 'జీవనవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర' అనే అంశంపై సోమవారం పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో కొండమంజులూరు రావుల జానకి రామయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని యల్లంకి సంధ్యరాణి జిల్లా స్థాయిలో వకృత పోటీల్లో ప్రథమ స్థానం, ఎనిమిదో తరగతి విద్యార్థులు చాతరాజుపల్లి పవన్ గోపికృష్ణ, పంచుమర్తి హితేంద్రలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న జిల్లా కేంద్రంలో జరిగే వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం, నగదు బహుమతులు అందజేస్తారని హెచ్‌ఎం ఇమ్మిడిశెట్టి అనిత మంగళవారం తెలిపారు. విజేతలను పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గోలి సంధ్య, వైస్ చైర్మన్ నరసింహారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కార్యాలయ ఏర్పాటుకు దాత విరాళం



ట్రస్టు తరుపున చెక్ అందిస్తున్న బ్రహ్మారెడ్డి

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డు ఉద్యోగుల సంఘం చీరాల యూనిట్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన తన వంతు సహాయంగా ట్రస్టు అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి రూ.1 లక్ష విరాళాన్ని మంగళవారం అందించారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో ఉండగా కార్యాలయం ఏర్పాటుకు ఆయన విరాళాన్ని చీరాల యూనిట్ గౌరవాధ్యక్షుడు కోడూరి ఏకాంబరేశ్వర బాబుకు చెక్ అందించారు. ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు విరాళం అందించిన బ్రహ్మారెడ్డిని చీరాల యూనిట్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా అధికారులు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించి వలసలు నిర్మూలించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది, ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ ఎస్.రాజేష్ హెచ్చరించారు. మంగళవారం చీరాల మండల పరిషత్ కార్యాలయంలో 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 16వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో చేపట్టిన 1243 పనులు, ఉపాధి కూలీలకు చెల్లించిన నగదు, వసతులు, మెటీరియల్ సరఫరా, మొక్కల సంరక్షణ తదితర పనులపై సామాజిక తనిఖీ బృందం పంచాయతీల వారిగా చేసిన పనులను వివరించారు. జిల్లా హెచ్ ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, జిల్లా ఏపీడీ సువార్త, డీపీఎం రాజారావు, ఎస్ఆర్‌పీ చిరంజీవి, ఏపీవో దాసు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



చెత్తనుంచి సంపదపై అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్డీ



వేటపాలెం: మాట్లాడుతున్న తహశీల్దార్ పార్వతి

కారంచేడు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల సంయుక్తంగా పనిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2024-25పై నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రమైన కారంచేడు గ్రామ పంచాయితీలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు గ్రామ కార్యదర్శి, సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలినలతో పరిస్థితులను అధ్యాయనం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: చెత్తనుంచి సంపద కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవచ్చని ఈవోఆర్డీ దాసరి సుమతి అన్నారు. సర్పంచ్‌లు, సెక్రటరీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రెండోరోజు శిక్షణ జరిగింది. శిక్షణలో భాగంగా నక్కబొక్కలపాడు గ్రామంలోని చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

మార్టూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఏఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం, బాపట్ల జిల్లా ట్రైనింగ్ డైరెక్టర్ అమర్ బాబు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌ల అధికారాలు విధులు బాధ్యతలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్ ఈవోపీఆర్డీ సుబ్బారావు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కారంచేడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

స్వాతంత్ర్య వేడుకలకు బిస్కెట్లు పంపిణీ

జే.పంగులూరు: స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనే విద్యార్థులందరికీ తమ ట్రస్ట్ ద్వారా ఉచితంగా బిస్కెట్లు పంపిణీ చేసినట్లు విద్యాదాత, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో పంగులూరు మండలంలోని 44 పాఠశాలల్లో, అద్దంకి మండలంలోని చక్రాయపాలెం పాఠశాలలో బిస్కెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రూ.18 వేల వ్యయంతో బిస్కెట్లు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.

వితంతువులకు అండగా న్యాయ సేవాధికార సంస్థ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రామకృష్ణారెడ్డి

చీరాల రూరల్: అర్హులైన వితంతువులందరికి పింఛన్లు అందించాలని న్యాయవాదులు పేర్కొన్నారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని ఈపురుపాలెం పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చీరాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొమ్మనబోయిన వాసుబాబు, ఆసాది రామకృష్ణారెడ్డి, కొమ్మనబోయిన సుబ్రహ్మణ్యంలు పాల్గొని మాట్లాడారు. వితంతు పింఛన్లు ఏవిధంగా పొందాలి, ఎటువంటివారు పింఛన్లకు అర్హులు అనే విషయాలపై న్యాయవాదులు మాట్లాడారు. పింఛన్లు పొందటానికి ఎవరికి ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా చీరాల కోర్టు భవన సముదాయాల్లోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని వారు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన నిరుపేదలకు, చిన్నపిల్లలకు, దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. వితంతులు మొక్కవోని ధైర్యంతో జీవితంలో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో పంచాయితీ సెక్రటరి వెంకటేశ్వర్లు, పీఎల్వీ, జేవీఎస్ కృష్ణ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. ఈ మిషన్‌ను రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ అద్దంకి లేవి ప్రసాద్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన వుండ్ల కోటేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, అశహరి హరి ప్రసాద్, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, గాడేపల్లి దివాకరదత్తు, పువ్వాడ రామకోటేశ్వరావు భువనేశ్వరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.